క్లుప్తంగా

కిడ్నీ వ్యాధులపై అవగాహన



మాచర్ల: పట్టణంలోని మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ప్రపంచ కిడ్నీ వ్యాధుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డాక్టర్ వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపోలో డయాలసిస్ సెంటర్ పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు అందించనున్నట్టు చెప్పారు. నెహ్రూ నగర్, గౌడకాలనీ, వివిధ నర్సింగ్ విభాగాల సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రభుత్వ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

'నులి పురుగుల నిర్మూలన'ను జయప్రదం చేయాలి



మాచర్ల: జిల్లాలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యులు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డాక్టర్ అరుణ్ కుమార్, లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పోస్టర్లు ఆవిష్కరించారు. మంగళవారం ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఏదైనా ఆటంకం కలిగితే 104కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆర్‌ఐగా శ్రీనివాసరావు



మాచర్ల రూరల్: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నిమ్మల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం డెప్యూటీ తహసీల్దార్ వాణికి ఉత్తర్వులు అందాయి. దుర్గి మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావుకు ఆర్‌ఐగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు వీఆర్‌ఓలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావుకు సన్మానం



మాచర్ల రూరల్: వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షులుగా వీఆర్‌ఓ ఆరుముళ్ళ నాగేశ్వరరావు ఎన్నిక కావటం ఆనందదాయకమని వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరికట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం కంభంపాడు గ్రామ సచివాలయంలో నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఫ్రాన్సిస్, రామస్వామి, కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, కలివెల వెంకయ్య, మాధవి, విజయ్, మోషే, నాయక్, శౌరీ పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గురజాల : గురజాల నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను వైద్య, ఆరోగ్య శాఖ పంపిణీ చేయనుంది. నియోజకవర్గంలోని పాఠశాలలు, విద్యాలయాల్లో 0–19ఏళ్లలోపు పిల్లలు సుమారు 40 వేల మంది ఉండగా, వీరందరికీ మాత్రలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ సిద్ధమైంది. గురజాల మండలంలో 1,460, దాచేపల్లిలో 9,250, మాచవరంలో 8,200, పిడుగురాళ్ల రూరల్ మండలంలో 5,307, పిడుగురాళ్ల పట్టణంలో 9,050 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

నకరికల్లు ఆర్‌ఐగా అనూష

నకరికల్లు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా దావులూరి అనూష సోమవారం బాధ్యతలు చేపట్టారు. బెల్లంకొండ మండలం జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనూష పదోన్నతిపై ఆర్‌ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

ఆటోబోల్తా.. ఇద్దరికి గాయాలు

ముప్పాళ్ళ: సత్తెనపల్లి–నరసరావుపేట రహదారిపై జీబీసీ కాల్వ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద సోమవారం ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడింది. ఆటో స్టీరింగ్ రాడ్ విరిగిపోవటంతో ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న నరసరావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ భాస్కరరావు, అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

కాపాడే కంటిపాపల్లె

- పల్లె చెంతకు వైద్యం
- గ్రామాల్లో హెల్త్‌క్లినిక్‌లు
- పేదలకు మెరుగైన సేవలు
- సత్ఫలితాలిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్



గోగులపాడు గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

గురజాల : గ్రామాలను కంటిపాపలా కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టింది ఫలితంగా కార్పొరేట్ వైద్యం పల్లెబాట పడుతోంది. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

ఇంటి చెంతనే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు

ఇంటికి కూతవేటు దూరంలోనే ఆస్పత్రి ఉండాలనే సదుద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికోసం వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఓ వైపు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను నాడు–నేడు పథకంలో భాగంగా ఆధునికీకరిస్తూనే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోంది. సిబ్బందిని నియమిస్తోంది. వైద్య వసతులను కల్పిస్తోంది. కార్పొరేట్ వైద్యసేవలను ప్రజలకు ముంగిళ్ల వద్దే అందించేలా ప్రణాళిక రచిస్తోంది. దీనిలో భాగంగా ఫ్యామిలీ ఫిజిషియన్ అనే వినూత్న కార్యక్రమాన్నీ చేపట్టింది. ఫలితంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

44 వీహెచ్‌సీల నిర్మాణం

గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 44 విలేజ్ హెల్త్ క్లినిక్(వీహెచ్‌సీ)ల నిర్మాణాన్ని అధికారులు చేపట్టారు. ఇందులో 27 ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసుకున్నాయి. 17 వివిధ దశల్లో ఉన్నాయి. ఒకొక్క వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ.17.50 లక్షలు చొప్పున మంజూరు చేశారు.

మండలాలవారీగా హెల్త్‌క్లినిక్‌లు ఇలా..

మండలం	నిర్మించాల్సినవి	నిర్మితమైనవి
గురజాల	11	05
దాచేపల్లి	08	04
మాచవరం	12	10
పిడుగురాళ్ల	13	08
మొత్తం	44	27

మెరుగైన వైద్యసేవలు



ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవలు అందుతన్నాయి. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అంతేగాక ప్రతి పల్లెకు వైద్యసేవలు అందేలా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మిస్తోంది. వీటిద్వారా ప్రజలకు సత్వర చికిత్స సాధ్యమవుతుంది.

పద్మావతి,
వైద్యురాలు, మాడుగుల

స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించండి



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న మాచర్ల అధికారులు

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వచ్చిన ప్రతి అర్జీనీ వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ శివశంకర్ కోరారు. సోమవారం మండలస్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యులు, వైద్య సిబ్బంది డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలన్నారు. వేసవిలో వలసల నివారణకు ఉపాధి హామీ పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. హైవే, జగనన్న మీ భూమి రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది చురుగ్గా పాల్గొని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంఈఓ వేముల నాగయ్య, డెప్యూటీ తహసీల్దార్ వాణి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై కళాజాత



విజయపురిసౌత్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కర్నూల్ సహకారంతో ఆర్థిక అక్షరాసత్యత కేంద్రం మాచర్ల ఆధ్వర్యంలో మండలంలోని బెల్లంకొండ వారి పాలెం గ్రామంలో ఆదివారం రాత్రి బ్యాంకింగ్ పథకాలపై రాంబాబు కళాజాత బృందం ప్రత్యేక ప్రదర్శన ఇచ్చింది. ఆర్థిక అక్షరాస్యత, ఆన్‌లైన్ మోసాలను కళ్లకు కట్టింది. సైబర్‌నేరాలపై 1930కి ఫిర్యాదు చేయాలని కళాజాతా బృందం సూచించింది. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ ఏలూరి నాగరాజు, వీవోఏ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

గురజాల: వరిగడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని దైద గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన కడియం యోహాన్‌కు చెందిన 80 వరి గడ్డి కట్టలకు నిప్పులు చెలరేగి మంటలు వ్యాప్తి చెందాయి. 80 గడ్డి వాము కట్టలు పూర్తిగా కాలిపోయి బూడిదపాలైయ్యాయి. ఘటన స్థలాన్ని గ్రామ వీఆర్వో సర్వేశ్వరరావు పరిశీలించారు.

తొండపిలో ఫ్యామిలీ డాక్టర్

తొండపి(ముప్పాళ్ళ): తొండపి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, సూర్యప్రకాశరావు పాల్గొని 82 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులను అందించారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమైన వారికి వైద్య సేవలందించారు. పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ సుగుణ, సూపర్‌వైజర్లు పీటర్‌డానియేన్, భవానికుమారి, డీఈఓ రవితేజ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ కార్ లోన్ మేళా

సత్తెనపల్లి: పట్టణంలోని కెనరా బ్యాంక్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో జయలక్ష్మి మారుతి సుజుకి మెగా కార్ లోన్ మేళా సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బ్రహ్మ రాజు, అసిస్టెంట్ మేనేజర్ అనురాధ, అప్రైజర్ దేవరశెట్టి రవి కుమార్, మల్లేశ్వరరావు జయలక్ష్మి మారుతి సుజుకి నరసరావుపేట తరఫున బ్రాంచ్ మేనేజర్ శ్రీరామ్, జయ, ఎగ్జిక్యూటివ్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

లబోదిభో

- బెంబేలెత్తిస్తున్న శునకాలు
- ప్రతివీధికి 20కిపైగా సంచారం
- పట్టణవాసుల కష్టాలు



పిడుగురాళ్ల పిల్లలగడ్డలో సంచరిస్తున్న శునకాలు

పిడుగురాళ్ల: పట్టణంలో శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకూ కుక్కల సంఖ్య పెరుగుతోంది. రాత్రిపూట అయితే చాలు అవి స్వైర విహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనచోదకులపై దాడి చేస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలోని 33వ వార్డులోని, 17 సచివాలయ పరిధిలో వీధి కుక్కలు భారీగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇటీవలే పిల్లల గడ్డ ప్రాంతంలోని ఇద్దరు చిన్నారుల వెంట కుక్కలు పడ్డాయి. దీంతో పరిగెత్తిన పిల్లలు కిందపడి గాయపడ్డారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, ప్రజాశక్తి నగర్, శివాలయం, శ్రీనివాస్ కాలనీ, సుందరయ్య కాలనీ, స్వర్ణాపిచ్చయ్య కాలనీ, లెనిన్ నగర్ ఇందిరమ్మ కాలనీ, జమునాస్కూల్, మారుతీనగర్ ఇలాంటి ప్రాంతాల్లోనూ నిత్యం పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి.

కుక్కలు వెంట పడుతున్నాయి



రెండురోజుల క్రితం పాలప్యాకెట్ కోసం వెళ్తుండగా 20కిపైగా కుక్కలు వెంట పడ్డాయి. భయంతో పరుగు తీసి సమీపంలోని షాపులోకి వెళ్లాను. కుక్కల బెడద నుంచి మున్సిపల్ అధికారులు విముక్తి కల్పించాలి.

– షేక్ ఖూరే సైదా,
పిల్లల గడ్డ పిడుగురాళ్ల

ప్రజలను రక్షించాలి



మా శివాలయం బజారులో కుక్కలు బాగా పెరిగాయి. పిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయంలో వెంటపడుతున్నాయి. మా స్నేహితుడి పిల్లలను కుక్కలు కరిచాయి. వైద్యం చేయిస్తున్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలి.

– షేక్ జమాల్ సైదా,
పిడుగురాళ్ల

త్వరలోనే పరిష్కారం



పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుక్కల సమస్య ఎక్కువగా ఉందని మా దృష్టికి వచ్చింది. గతంలో కోతులను పట్టించే కార్యక్రమం చేపట్టాం. త్వరలోనే కుక్కలను కూడా పట్టుకుని అటవీప్రాంతంలో, దూర ప్రాంతంలో విడిచి పెట్టే కార్యక్రమం చేపడతాం. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– ఎ.వెంకటేశ్వర్లు,
మున్సిపల్ కమీషనర్

రోజూ కుక్కకాటు బాధితులు

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు ప్రతి రోజూ కక్కకాటు బాధితులు వస్తున్నారని వైద్యసిబ్బంది చెబుతున్నారు. నెలలో సుమారు 40 నుంచి 50 కేసులు నమోదవుతున్నట్టు వివరిస్తున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

రాజుపాలెం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వసభ సమావేశం సోమవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. వేసవి సమీపిస్తున్నందున మంచి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చేతిపంపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. ముందుగా మండల స్థాయి అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. తహసీల్దార్ నళిని మాట్లాడుతూ కొండమోడు నుంచి పేరేచర్ల వరకు జాతీయ రహదారి నిర్మాణం కోసం మండలంలో ఇళ్లు, భూములు పోయే రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ నుంచి జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఎంఈవో బి.మల్లికార్జునశర్మ, డాక్టర్ రవితేజనాయక్, ఏపీవో చెవుల వెంకటేశ్వర్లు, ఏపీఎం సునీత, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

సత్తెనపల్లి: పట్టణంలోని తారకరామ సాగర్‌లో పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టారు. సోమవారం ప్రత్యేకంగా చెరువులోని కలుపు మొక్కలను కార్మికుల చేత తొలగింపజేశారు. ఈ పనులను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

అచ్చంపేట: మాదిపాడులో రూ.15లక్షలతో నిర్మించతలపెట్టిన మైనార్టీ కమ్యూనిటీ హాలుకు సోమవారం ఎంపీటీసీ భూక్యా రమేష్‌స్వర్ణమ్మభాయ్, సర్పంచ్ మాదా ఈశ్వరమ్మవెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్వర్ణమ్మభాయ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో కమ్యూనిటీ హాలు సాకారం కాబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు షేక్ కరీమ్, లాలు, జాన్‌సాహెబ్, సుభాని, బీసీ నాయకులు మునగాల శేషగిరి, ఎస్సీ నాయకులు చిట్యాల దావీదు, సత్తెమ్మతల్లి దేవాలయ కమిటీ చైర్మన్ గుడారి గోపియాదవ్, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వినర్ యాంపొంగు దాసు, స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ లాలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ.. నమోస్తుతే..

కారెంపూడి: నరమాలపాడు శివారు వైకుంఠపురం గిరిజనులు అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారికి కుంకుమ బండి కట్టారు. ఈ బండిని ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (పీవీఆర్) కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అక్కడే వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వెంకటరామిరెడ్డి చేతుల మీదగా కేక్ కట్ చేయించారు. గ్రామ సర్పంచ్ గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ చేవూరి భవాని, మాజీ ఎంపీటీసీ యాకసిరి తిరుపతిరావు, చేవూరి శ్రీను, చలంచర్ల రామకృష్ణ, యాకసిరి వీరాంజనేయులు, రాపూరి నాగేశ్వరరావు తదితరులు వెంకటరామిరెడ్డిని సన్మానించారు. ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గి మండలంలో..

దుర్గి: అడిగొప్పల, ఓబులేశునిపల్లె గ్రామస్తులు తీర్చిదిద్దిన కుంకుమ బండ్లను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆదివారం రాత్రి సందర్శించారు. ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి వాటిని ప్రారంభించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిగొప్పల సర్పంచ్ నాలి రామయ్య, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, నలబోతు చిన్నబ్బాయ్, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, అల్లయ్య, గుండాల వెంకట్రామయ్య, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, బూడిద శ్రీనివాసరావు, ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, నాగెండ్ల లక్ష్మినారాయణ, జంగా యలమంద పాల్గొన్నారు.



కుంకుమ బండిని ప్రారంభిస్తున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, పార్టీ నాయకులు



కుంకుమ బండ్లను సందర్శించిన పీవీఆర్

వైఎస్సార్ సీపీ నాయకుడు జవ్వాజి మృతి



వెంకటేశ్వర్లు యాదవ్ (ఫైల్)

కారెంపూడి: మండల బీసీ నాయకుడు పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన జివ్వాజి వెంకటేశ్వర్లు యాదవ్(60) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వర్లు గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి వెంకటేశ్వర్లు ఎనలేని సేవలందించారు. ఆయన సేవలను గుర్తించి రెండో విడత గ్రామ సర్పంచ్‌గా వెంకటేశ్వర్లు భార్య నాగమణిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎంపిక చేశారు. వెంకటేశ్వర్లు మృతి వార్త పట్ల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గుంటూరు నుంచి మృతదేహాన్ని కుంటుంబ సభ్యులు సోమవారం రాత్రి స్వగ్రామానికి తరలించనున్నారని తెలుస్తోంది. గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

కమీషన్ వ్యాపారి మోసం చేశాడు

అచ్చంపేట: పంటను కొన్న కమీషన్ వ్యాపారి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడంటూ తాళ్లచెరువు గ్రామానికి చెందిన కొందరు రైతులు, మహిళా రైతులు సోమవారం అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే తాళ్లచెరువు గ్రామానికి చెందిన ఓ కమీషన్ వ్యాపారి 2021 ఏప్రిల్‌లో రైతుల వద్ద 140 క్వింటాళ్ల మిర్చి పంటను క్వింటా ఒక్కంటికి రూ.12,000 చొప్పున రూ.16 లక్షలకు కొన్నాడు. వారంలో డబ్బులు ఇస్తానని చెప్పాడు. రెండేళ్లయినా ఇప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. ఇప్పుడు చేతనైంది చేసుకోవాలని దబాయిస్తున్నాడు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్‌ఐ కె.పాల్ రవీంద్ర తెలిపారు.

వైభవంగా సీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టింపజేస్తున్న గ్రామస్తులు

పిడుగురాళ్లరూరల్: బ్రాహ్మణపల్లి శివారులోని చెన్నాయిబోడు వద్ద కొత్తగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠా సోమవారం వైభవంగా జరిగింది. సీతారామాంజనేయస్వామి, ఆలయ ఆవరణలో అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠతోపాటు ఆలయం ఎదురుగా కీర్తి ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే వాసుదేవ పుణ్యహవచనం, శాంతి హోమం, పీఠదేవత స్థాపనలు, బిందె స్థాపనలు జరిపించారు. మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం జరిగాయి. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. తర్వాత మహాన్నదానం నిర్వహించారు.

ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజగోపాల్

మాచవరం: ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చూడాలని ఎంపీడీఓ వై.రాజగోపాల్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, సచివాలయ ఏఎన్‌ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,200 మంది చిన్నారులు ఉన్నారని, నూరుశాతం మాత్రలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్, ఎంఈఓ ప్రసాద్, విస్తరణాధికారి పట్టాబి, సిబ్బంది సురేష్,చిన్నమ్మ, చిన్నారి రోజ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహాల నిర్మాణం వేగవంతం చేయాలి



నగర పంచాయతీ అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీ

దాచేపల్లి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకులు జి.శ్రీనివాసరావు చెప్పారు. నగర పంచాయతీలోని జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని, మార్చి నెలాఖరునాటికి 90శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. వార్డు సచివాలయ విధులు సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. సమీక్షలో నగర పంచాయతీ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్.. వ్యక్తికి గాయాలు

పిడుగురాళ్లరూరల్: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో కిందపడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. తుమ్మలచెరువు గ్రామ శివారున టోల్‌ప్లాజా వద్ద ఈ ఘటన సోమవారం జరిగింది. దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి చెందిన మోహన్ వ్యక్తిగత పనిమీద పిడుగురాళ్ల నుంచి దాచేపల్లి వెళ్తుండగా టోల్‌ప్లాజా దాటగానే బైక్ అదుపుతప్పి పడిపోయి గాయపడ్డాడు. స్థానికులు 108 ద్వారా అతడిని ఆస్పత్రికి తరలించారు.